

2018 ప్రజాఆశీర్వాద సభకు హెలిక్యాప్టర్‌లో వచ్చి హుస్నాబాద్‌లో అడుగుపెడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

ఉద్యమాల పురిటిగడ్డ హుస్నాబాద్ ఆది నుంచి తెలంగాణ ఉద్యమంలో ముందున్నది. ఈ ప్రాంతమంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అమితమైన ప్రేమ.తనకు అచ్చొచ్చిన, సెంటిమెంట్‌గా భావించే హుస్నాబాద్ నుంచే 2014, 2018 ఎన్నికల శంఖారావాన్ని సీఎం కేసీఆర్ మొదలుపెట్టారు. ఈసారి జరిగే శాసనసభ ఎన్నికల్లోనూ హుస్నాబాద్ గడ్డ నుంచే ప్రజా ఆశీర్వాద సభ ద్వారా ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్‌లో ఒకనాడు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఉండేవి. స్వరాష్ట్రంలో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కావడంతో రైతులకు వరప్రదాయినిగా మారింది. వేల కోట్ల రూపాయలతో ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగడంతో మౌలిక వసతులు ఒనగూరాయి.



జూలై 4, 2015న హుస్నాబాద్‌లో తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఎల్లమ్మ గుడి వద్ద బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

# అచ్చొచ్చిన గడ్డ హుస్నాబాద్

## హుస్నాబాద్ నుంచే తొలి అడుగు

- 2014, 2018 ఎన్నికల శంఖారావానికి హుస్నాబాద్‌లోనే శ్రీకారం చుట్టిన కేసీఆర్
- సీఎం కేసీఆర్‌కు కలిసి వస్తున్న హుస్నాబాద్
- రాష్ట్ర స్థాయిలో హుస్నాబాద్ పేరు
- సీఎం కేసీఆర్ కృషితోనే గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి
- నియోజకవర్గానికి నిధుల వరద కేసీఆర్ చలవే
- ప్రతిష్టాత్మకంగా హుస్నాబాద్ 'ప్రజా ఆశీర్వాద సభ'
- భారీగా తరలిరానున్న గులాబీదండు

హుస్నాబాద్, అక్టోబర్ 14: తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఇప్పటి వరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు హుస్నాబాద్‌తో వీడదీయరాని అనుబంధం ఉంది. ఈ నియోజకవర్గంలోని సబ్బండ వర్గాలు ఉద్యమంలో కలిసి రావడం, ఉద్యమ స్ఫూర్తిని నింపుకొని గత ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇవ్వడమనే చెప్పొచ్చు. అందుకే 2014, 2018 ఎన్నికల శంఖారావాన్ని సీఎం కేసీఆర్ హుస్నాబాద్ నుంచే మొదలుపెట్టారు. ఇదే స్ఫూర్తితో మళ్లీ ఈ సారి ఎన్నికలకు ఇక్కడినుంచే శ్రీకారం చుట్టాలని ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించబోతున్నారు. దీంతో రాష్ట్ర రాజకీయాలకు హుస్నాబాద్ కేంద్ర బిందువైంది. తనకు అచ్చొస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో కేవలం 1.24 టీఎంసీల సామర్థ్యం ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్‌ను 8.23 టీఎంసీలకు పెంచారు. అందుకు తగిన నిధులను వెంటనే మంజూరు చేసి పూర్తి చేయించిన ఘనత ఆయనదే. హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోట్లాది రూపాయల నిధులను కేటాయించారు. మహాసముద్రం గండిని స్వయంగా సందర్శించి నిధుల కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించారు. హరితహారంలో ముందుండాలనే లక్ష్యంతో హుస్నాబాద్‌లో స్వయంగా మొక్కలునాటి ఇక్కడి ప్రజలకు కేసీఆర్ స్ఫూర్తినిచ్చారు. మరోసా ఇక్కడే ఎన్నికల శంఖారావం పూరించి ఎన్నికల్లో ఘన విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్న సీఎం కేసీఆర్ రాబోయే రోజుల్లో హుస్నాబాద్‌ను బంగారు నియోజకవర్గంగా తీర్చి దిద్దుతారనే నమ్మకంతో ప్రజలు ఉన్నారు.

### 2015, ఏప్రిల్ 13న

### గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల సందర్శన...

హుస్నాబాద్ ప్రాంత వరప్రదాయినిలు అయిన గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లను ఏప్రిల్ 13, 2015న సీఎం కేసీఆర్ స్వయంగా సందర్శించారు. రెండు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్న కేసీఆర్ చిన్న చెరువులను తలపించే రిజర్వాయర్లతో ఈ ప్రాంత రైతులకు ఒరిగేదేమీ లేదని, రిజర్వాయర్ల సామర్థ్యం పెంచుతున్నామని ప్రకటించారు. అదనంగా భూములు కోల్పోయే నిర్వాసితులకు కొండంత అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగానే గౌరవెల్లి రిజర్వాయర్ సామర్థ్యం 1.24 టీఎంసీల నుంచి 8.23 టీఎంసీలకు పెంచారు. నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని పెంచారు. గండిపల్లి రిజర్వాయర్ 0.25 టీఎంసీల నుంచి 1.25 టీఎంసీలకు పెంచారు. వీటికి రూ.2వేల కోట్ల నిధులను మంజూరు చేశారు. ప్రస్తుతం రెండు రిజర్వాయర్లు పనులు పూర్తయ్యాయి. ఇదేరోజున మహాసముద్రం గండిని స్వయంగా సందర్శించి అక్కడే నాయకులు, ప్రజల మధ్య సహపంక్తి భోజనాలు చేసి దీని పునరుద్ధరణకు రూ.8కోట్ల నిధులు కేటాయించారు. గండి నిర్మాణం పూర్తి కావడంతో సుమారు 20గ్రామాల్లోని వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి.

### 2015, జూలై 4న

### హుస్నాబాద్ నుంచే హరితహారం ప్రారంభం

ముఖ్యమంత్రి కేసీఆర్ కలలుగన్న ఆకుపచ్చ తెలంగాణలో భాగంగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని హుస్నాబాద్‌లోనే ప్రారంభించారు. జూలై 4, 2015 రోజున హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో తొలిమొక్కను నాటి హరితహారం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ముఖ్యమంత్రి స్వయంగా మొక్కలు నాటి స్ఫూర్తినివ్వడంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో వేలాది మొక్కలు నాటారు. వాటిని కాపాడడంతో ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో హుస్నాబాద్ పట్టణ అభివృద్ధికి రూ.కోటి నిధులు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు గ్రామానికో రూ.10లక్షల రూపాయల అభివృద్ధి నిధులు మంజూరు చేశారు. అప్పటి నుంచే హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి నాంది పలికినట్లయ్యింది.




2018ఎన్నికల ప్రజాఆశీర్వాద సభకు భారీగా హాజరైన జనం (ఫైల్)

### 2014, ఏప్రిల్ 17న హుస్నాబాద్‌లో ఎన్నికల శంఖారావం

గత అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని కేసీఆర్ హుస్నాబాద్ నుంచే ప్రారంభించారు. ఏప్రిల్ 17, 2014న హుస్నాబాద్‌లో జరిగిన బహిరంగ సభ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అంతకు నాలుగు రోజుల ముందు ఏప్రిల్ 13, 2014న కరీంనగర్‌లో సభ జరిగినప్పటికీ అసలైన ఎన్నికల ప్రచారం హుస్నాబాద్ నుంచే ప్రారంభమైంది. 2018, సెప్టెంబర్ 7న రెండో ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. ఈ రెండు సభలు పట్టణంలోని డిపో గ్రౌండ్‌లో జరగగా భారీగా జనం తరలివచ్చారు. రెండు సభల అనంతరం ఎన్నికల ప్రచారం ఉధృతంగా కొనసాగడం, ఆయా ఎన్నికల ఫలితాల్లో భారీ విజయం నమోదు కావడంతో ఈసారి కూడా ఇక్కడి నుంచే ప్రచారం మొదలు పెట్టేందుకు సీఎం కేసీఆర్ సిద్ధమయ్యారు. 14 ఏండ్ల ఉద్యమాన్ని కొనసాగించి రాష్ట్రాన్ని సాధించడంతో పాటు తొమ్మిదిన్నరేండ్ల విజయవంతమైన పాలన అందించిన సీఎం కేసీఆర్ హుస్నాబాద్‌లో ఈనెల 15న జరిగే ప్రజాఆశీర్వాద సభ విజయవంతమై హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా తెలంగాణ చరిత్రలో నిలుస్తారని, తెలంగాణను అన్నిరంగాల్లో దేశంలో నంబర్‌వన్‌గా నిలబెడతారని ఆశిద్దాం.



హుస్నాబాద్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, రాధాకృష్ణశర్మ, రాజిరెడ్డి తదితరులు



సీఎం రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్

శనివారం రాత్రి విద్యుత్ కాంతుల్లో సీఎం కేసీఆర్ సభా వేదిక

# అపర భగీరథుడు సీఎం కేసీఆర్

## జలాలను సద్వినియోగం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే

- పదేండ్లలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దారు
- హుస్నాబాద్‌లో జరగబోయే తొలి ఆశీర్వాద సభకు ప్రజల నుంచి భారీ స్పందన
- మూడోసారి కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ కొట్టడం ఖాయం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే బీఆర్‌ఎస్ మేనిఫెస్టో
- హుస్నాబాద్‌లో జరిగిన అభివృద్ధే మూడోసారి గులాబీ జెండాను నిలబెడుతుంది
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హుస్నాబాద్‌లో సీఎం కేసీఆర్ తొలి ఆశీర్వాద సభ ఏర్పాట్ల పర్యవేక్షణ

హుస్నాబాద్, అక్టోబర్ 14: తెలంగాణ రాకముందు ప్రాజెక్టుల నిర్మాణం జరగక పోవడంతో వేలాది టీఎంసీల కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రంలో కలిసిపోయేవని, జలాలను సద్వినియోగం చేసి రాష్ట్రంలోని రైతాంగానికి, ప్రజలకు సాగు, తాగునీరందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఆదివారం జరగనున్న సీఎం కేసీఆర్ తొలి ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో కలిసి శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆరున్నర దశాబ్దాల్లో జరగని అభివృద్ధిని పదేండ్లలో సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. గోదావరి నదిపై కేవలం పోచంపాడు ప్రాజెక్టు మాత్రమే ఉండేదని, తెలంగాణ వచ్చిన తర్వాత ఇదే నదిపై ఆరు ప్రాజెక్టులను నిర్మించి పాతాళంలో ఉన్న గోదారమ్మను పైకి తెచ్చిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఎడారి జిల్లాలను పచ్చని జిల్లాలుగా మార్చడం, పుష్కలంగా పంటలు పండించుకునే అవకాశం కల్పించారన్నారు. విద్య, వైద్య రంగాల్లోనూ రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. 33మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం 10వేల మంది వైద్యులను తయారు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. 2014కు ముందు కేవలం 7,500ల మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అయ్యేదని, ప్రస్తుతం 26వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసుకొని 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 1.30లక్షల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. హుస్నాబాద్‌లో జరగనున్న తొలి ప్రజా ఆశీర్వాదసభకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని, లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థుల సమావేశంలో బీఫామ్‌లు అందజేసి అనంతరం సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను ప్రకటిస్తారని చెప్పారు.

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే బీఆర్‌ఎస్ మేనిఫెస్టో: ఎమ్మెల్యే వొడితెల

తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఉంటుందని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. పదేండ్ల పాటు ప్రజారంజక పాలన అందించిన సీఎం కేసీఆర్ ప్రజలకు ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను ప్రకటిస్తారని చెప్పారు. హుస్నాబాద్‌లో మూడోసారి కూడా ప్రజాఆశీర్వాద సభను నిర్వహించడం హర్షణీయమని, సభను విజయవంతం చేసేందుకు పార్టీ క్యాడర్ నిరంతరంగా పనిచేస్తున్నదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఇక్కడి ప్రజలందరికీ తెలుసునని, ఎక్కడి నుంచో వచ్చిన వారికి ఇక్కడి అభివృద్ధి ఎలా కనబడుతుందని హెద్దేవ చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో 68వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నామని, గౌరవెల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేశామన్నారు. హుస్నాబాద్ పట్టణాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని, గ్రామాల్లోనూ అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే మూడోసారి గులాబీ జెండాను నిలబెడుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, కర్ర శ్రీహరి, పేర్యాల రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్, ఎంపీపీలు మానస, మాలోతు లక్ష్మీ, జడ్పీటీసీ భూక్యా మంగ, ఎన్‌ఎల్‌సీఎఫ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, నాయకులు ఎడబోయిన తిరుపతిరెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, అన్వర్, మహేందర్, ఆకుల వెంకట్, కొక్కుల సురేశ్, శ్రీకాంత్, బీలూనాయక్, పరశురామ్, బండి పుష్ప, క్రాంతిరెడ్డి, రమేశ్‌నాయక్, కౌన్సిలర్లు, సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న సిద్దిపేట సీపీ శ్వేత, పోలీస్ సిబ్బంది

- ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న సీఎం.. హుస్నాబాద్ నుంచే తొలి బహిరంగ సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన బోయినపల్లి వినోద్‌కుమార్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్
- హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు: సిద్దిపేట సీపీ శ్వేత

# హుస్నాబాద్‌కు ప్రగతి ప్రదాత

## నేడు హుస్నాబాద్‌లో సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ



హుస్నాబాద్‌లో సీఎం సభాస్థలి వద్ద బాంబుస్క్వాడ్‌తో తనిఖీలు



హుస్నాబాద్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ వద్ద గ్రీన్ మ్యాట్ వేస్తున్న సిబ్బంది

హుస్నాబాద్, అక్టోబర్ 14: సీఎం కేసీఆర్‌కు సెంటిమెంట్‌గా ఉన్న హుస్నాబాద్‌లో ఎన్నికల తొలి ప్రజా ఆశీర్వాద సభ నేడు జరుగనున్నది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభకు హాజరు కానున్నారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి లక్షకు పైగా జనాన్ని సభకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### హుస్నాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు : సిద్దిపేట సీపీ శ్వేత

హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం జరగనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించి భద్రతా చర్యలపై చర్చించారు. బందోబస్తు, ట్రాఫిక్ ఆంక్షలు, పార్కింగ్‌పై పలు సూచనలు చేశారు.

### పార్కింగ్ స్థలాలు

1. హుస్నాబాద్, అక్కన్నపేట, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేర్ మండలాల నుంచి వచ్చే వాహనదారులు కరీంనగర్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో,సెయింట్ జోసెఫ్ స్కూల్ ఎదురుగా ఉన్న స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకొని సభాస్థలికి చేరుకోవాలి.

2. కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల నుంచి వచ్చే వాహనదారులు కరీంనగర్ రోడ్డు ఇండియన పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలి.

### ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్

హుస్నాబాద్-కరీంనగర్, కరీంనగర్ -హుస్నాబాద్ వెళ్లే దారి ట్రాఫిక్ డైవర్షన్ చేశారు. ప్రజలు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలి. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుంది. హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనదారులు నాగారం, మహ్మదాపూర్, బొమ్మనపల్లి, సుందరగిరి నుంచి కరీంనగర్‌కు వెళ్లాలి. కరీంనగర్ నుంచి తిరిగి ఇదే దారిలో రావాల్సి ఉంటుందని పోలీసు అధికారులు తెలిపారు.